# మగాడి పాతివ్రత్యం!

సినిమాల్లో హీరో ఛాన్సిస్తామంటూ దర్శక నిర్మాతలు ఇంటిముందు క్యూ కట్టినా... పోనీ టి.వి. మెగా సీరియల్స్ వాళ్లమంటూ బెల్లం చుట్టూ ఈగలు మూగినట్టు... చెవిదగ్గర జోరీగలు రొద పెట్టినట్టూ ఇంటిచుట్టూ ప్రదక్షిణాలు చేసినా... 'నో' చెప్పటానికి మొహమాటపడ్లేదు అవినాష్!

అవినాష్ అంటే ఎఫ్.ఎం. బాండ్ మిర్చిమసాలా కార్యక్రమంలాగ చాలా హాటైనోడు. చీకట్లో నియాన్ బల్బ్ వెలుగులాంటివాడు.

కంకః అంఅః ఇంటర్ నేషనల్ ఫరమ్‌లో అతి పెద్ద పోస్ట్‌లో అతిపిన్న వయసులోనే దూరేడు!

హాట్‌కేక్స్‌లాగ ఎగరేసుకుపోవటానికి సిద్ధంగ డజన్లకొద్దీ సుందరీమణులు గిరగిరా తిరుగుతున్నా కేర్ చేయని మనిషి!

ఆడపిల్లన్నా... ప్రేమన్నా... లవ్‌మేరేజన్నా ఎలర్జీ! అలాంటి పోకడలకు ఆమడ దూరం! అవినాష్ వంటికి పడని పదార్థాలు.

ఇల్లు ఇరకటం ఆలి మర్కటంలా వుండాలనే థియరీని అక్షరాల పాటించటానికి ఇష్టపడతాడు.

అందుకే పోష్ ఏరియాలో వెయ్యి గజాల స్థలమున్నా అల్ట్రామోడరన్ స్టైల్లో బంగళా కట్టించలేదు. సోఫార్! ఆ స్థలాన్ని కబ్జా చేస్తామంటూ బెదిరింపు కాల్స్ వచ్చినా 'కేర్' చేయలేదు. పోలీసు అఫీషియల్స్ సర్కిల్స్‌లో మాంచి ఇన్ఫ్లూయన్స్ వున్నవాడు అవినాష్.

తాను అందగాడు కాబట్టి ఆలి మర్కటంలా వుంటేనే చెప్పినట్టు విని ఒళ్ళు దగ్గరుంచుకుని సంసారం సాఫీగా చేస్తుంది. పెళ్ళాం కూడా ఈక్వల్‌గ బ్యూటీక్వీన్ అయితే కొంపమునిగిందన్నమాటే! అది అవినాష్ భయం!

'భార్య రూపవతి శత్రువు' అనే సామెత పదేపదే మదిలో మెదుల్తూంటుంది. అందుకే ఎవరు ఎంత చెప్పినా చెవినేసుకోడు. తన ఒపీనియన్ మార్చుకోడు.

అవినాష్ ఫూలిష్ మనస్తత్వం చూచి ఇంటా బయట తిక్కలోడన్నారు. 'మేడ్ ఫెలో' అని కామెంట్ చేసినా డోన్ట్ కేర్ మాస్టర్! మనిషి మహామొండిఘటం!

ఎంతటి అందగాడో అంతకు వెయ్యిరెట్లు మనిషిలో పట్టుదలుంది.

భార్య అందమైనదైతే దాన్ని వెంటేసుకుని హయ్యర్ సర్కిల్స్‌లో తిరగాలంటే భయం!

విలన్‌గాళ్ళు నిత్యం వెంటాడుతుంటారు. మొగుడు మహాశయుడు ఆమెగారికి 'బాడీగార్డ్' లాగానో... పెంపుడుకుక్కలాగానో తోకాడించుకుంటూ వెంట తిరగటానికి ససేమిరా ఒప్పుకోడు.

ఏ రౌడీ రాస్కెలో... వీధిగూండానో... మంత్రిగారి బామ్మర్దో ఎలకపిల్లను గద్ద ఎగరేసుకు పోయినట్టు బ్యూటిఫుల్ వైఫ్‌ని కిడ్నాప్ చేయక మానడు.

పెళ్ళాన్ని పరాయివాడు రావణాసురుడు సీత నెత్తుకుపోయినట్టు లాక్కెళ్ళి మళ్ళీ తనవద్దకు పంపితే... అంతకంటే ఘోరం... దురన్యాయం మరోటి వుండదు. పెళ్ళాం శీలాన్ని శంకించి మంటల్లో దూకి నిజాయితీ నిరూపించుకోమనటానికిదేం త్రేతాయుగం కాదు.

అథవా అలా అంటే... భార్యకి పొడుచుకొస్తుంది. కిడ్నాపై రౌడీగాడి వళ్ళో వుండగా అప్పుడు లేని పౌరుషం... అవమానం... మొగుడు మాట్లాడితే భళ్ళుమని బైటికొస్తయ్.

కట్టుకున్న పెళ్ళాన్ని అవమానించాడు... అనుమానించాడు భర్త అంటూ మహిళా సంఘాలను... కోర్టును ఆశ్రయిస్తుంది. మొగుడిగాడి దుంప తెంపేస్తుంది. లబోదిబోమంటుంది. భర్త పరువు వీధిన పడేయటానికి వెనకాడదు. కాదూ కూడదూ అంటే భరణమీయమంటుంది. చదువుకొని సాలిడ్‌గా శాలరీ పుచ్చుకునే పెళ్ళామైతే అదీ అడగదు అదివేరే విషయం!

ఇన్ని ప్రాబ్లమ్స్ వున్నప్పుడు అందమైన ఆడపిల్లను లైఫ్ పార్ట్నర్‌గా చేసుకోకపోతేనేమని అవినాష్ అంతరాత్మ నిత్యమూ గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తూంటుంది.

ఆ కారణంగానే... అందం చందం లేనిపిల్లనే మేరేజ్ చేసుకోవాలని భీషణ (భీష్మ) ప్రతిజ్ఞ పూనాడు.

అసలు తాను వెధవపని చేశాడు. ఏ కరాటేనో నేర్చుకుని వున్నట్టయితే అందమైన అమ్మాయిని లవ్వాడినా... పెళ్ళాడినా... పిక్చర్స్‌లో హీరోలాగ పాతికమంది విలన్‌గాళ్ళు ఒక్కసారిగా దాడిచేసినా బ్రూస్లీ లాగ ఫోజులిచ్చి చితకబాదే అవకాశమన్నా వుండేది.

అలాంటి ఛాన్స్ లేకుండా పోయిందిప్పుడు. గతం గతః! అందుకేగా సీదాసాదా అమ్మాయిని పెళ్ళాడితే చాలనే డెసిషన్ తీసుకుంది.

పేరెంట్స్ చూసే సంబంధాలేవీ నచ్చకపోవటంతో మేరేజ్ బ్యూరో నిర్వాహకులు రంగప్రవేశం చేసి సిడీల్లో గల అమ్మాయిలను చూపిస్తూ వారి బయోడాటాలు తెలీచేస్తూ వేధించటం మొదలుపెట్టారు. డబ్బు కట్టమన్నారు. మ్యారేజ్‌బ్యూరోలో మెంబర్ కమ్మన్నారు. విదేశీ వనితల వివరాలు కూడా వున్నాయంటూ అవినాష్‌కి ఎరవేశారు.

మేడిన్ ఇండియానే కావాలన్నాడు. స్మగుల్డ్ గుడ్స్‌తో పన్లేదన్నాడు. బ్యూరో వారిక్కూడా

బోర్ కొట్టి పిల్లలున్నారంటూ విసిగించటం మానుకున్నారు.

తొందరగా ఏదో ఒక పిల్లమెడలో తాళి కట్టరా బాబూ అనేసి ఇంటిల్లిపాదీ ఒకటే లొల్లి!

'మీరిలా అనుక్షణం పెళ్ళిపెళ్ళనేసి నన్ను పీక్కుతిన్నారంటే... చివరికి ఏ ముదనష్టపుదాని నెత్తిమీదో జీలకర్ర బెల్లం పెట్టేస్తాను. అప్పుడు... 'మీ-నా' రోగం తక్కువ కుదుర్తుంది...' క్లాసు పీకాడు అవినాష్.

'ఈ వెధవాయ్ పెళ్ళి కళ్ళారా చూసే యోగం లేదేమోనే మనకు...' సెంచురీ కొట్టటానికి సిద్ధంగ వున్న బామ్మ రాని కన్నీళ్ళు పెట్టుకో ప్రయత్నిస్తూ అంది.

'పోనీ... మనింటి పనిపిల్ల నెత్తిన తలంబ్రాలు పొయ్యరా... ముష్టిదానికంటే ఇదే నయం!' తల్లి మాటలో వెటకారం ధ్వనించింది.

'వీధులూడ్చే పాపాయమ్మనో... అదీ కాకపోతే దాని అమ్మనో పెళ్ళాడేయరా... పీడ విరగడౌతుంది...' తండ్రిలో కోపం కట్టలు తెంచుకుంది! గుండె అగ్ని పర్వతంలా బ్రద్ధలైంది. సునామీలా వంటి కాలిమీద లేచి అవినాష్‌ను దుయ్యబట్టాడు.

'నన్ను మాటల ఈటెలతో పొడవకండి. నా చెవులకు తాటాకులు కట్టకండి! నేనేం చిన్నవాడిని కాదు. నెలకు డెబ్భైవేల జీతగాడ్ని. రోషం పౌరుషం తొంగిచూచాయి అవినాష్ జవాబులో.

ఇంట్లో వీళ్ళు... ఆఫీసులో ఎం.డి.గాడి టార్చరొకటి. ముంబైలో మోడలింగ్ చేసి కోట్లు సంపాదిస్తున్న తన ఏకైక కుమార్తెను చేసుకోమని ఒకటే నస!... మనసులో తిట్టిపోసాడు.

ఇంట్లో బైట వకటే పెళ్ళి గొడవ. వీళ్ళకు మరో పనివుండదో ఏమో అన్పించింది. విసుక్కున్నాడు. మనసు కష్టపెట్టుకున్నాడు. సన్యాసుల్లో కలిసిపోవాలనే ఆలోచనా రాకపోలేదు. బాబా సినిమాలో రజనీకాంత్ లాగ హిమాలయాలకు వెళ్ళిపోయి తపస్సు చేస్తేనైనా మనశ్శాంతి వుంటుందేమోనని కూడా అన్పించింది.

చదువు పూర్తై ఉద్యోగంలో జాయినైన రోజు నుండి పెళ్ళి పెళ్ళంటూ ఒకటే రణగొణ ధ్వని రావణగోల!

ఒకరోజు నైట్ టి.వీ.లో తెలుగు ప్రోగ్రామ్‌షో చూస్తూంటే అవినాష్‌కు కూడా పాల్గొనాలన్పించటంతో వెంటనే పార్టిసిపేషన్ కోసం ఎస్.ఎం.ఎస్ ఇచ్చాడు.

తనను వచ్చేవారమే రమ్మంటూ ఇంటిమేషనొచ్చింది. తన్లాంటి సొసైటీలో స్టేటస్ వున్నవాడు ఇలాంటి టి.వీ. గేమ్‌షోలో పాల్గొంటే నలుగురూ నవ్విపోతారేమోనన్పించింది.

ప్రైజ్‌మనీ కోటి రూపాయలు! అమ్మో... వెరి బిగ్ ఎమౌంట్. లక్ తగిలితే వెరీ వెరీ హేపీస్! స్వంత కంపనీ పెట్టుకోవచ్చు అన్పించింది.

'లెట్‌మి ట్రై' అనుకుని మనసుని తగిన రీతిలో సమాధానపరచుకుని పార్టిసిపేషన్‌కి బయల్దేరాడు అవినాష్. మొదటిసారిగ కెమెరాముందు నిలబడబోతున్నాడు. లక్షలమంది తనని టి.వి.లో వీక్షిస్తారు. ఓహ్! గొప్ప థ్రిల్‌గ వుంటుంది. తీరా వెళ్ళాక ప్రేక్షక ఫియర్... స్టేజీఫియర్... కెమెరా ఫియర్‌తో నోరు పెగలకపోతే? వళ్ళంతా ముచ్చెమటలు పోస్తేనో?

'డామిట్! కథ అడ్డం తిరిగింది' అనుకోవలసి వస్తుందేమో కన్యాశుల్యంలో గిరీశంలాగా...!

అంతా తికమక... మకతికగా వుంది. తీరా ఆఫరొచ్చేక వెళ్ళకపోతే... షేమ్! తన్లాంటివాడు చెయ్యాల్సిన పనేనా?-

నో! ఏది ఏమైనా వెళ్ళి తీరాల్సిందే! ఆఫర్ ఏక్సెప్ట్ చేయాల్సిందే... కోటిరూపాయల ప్రైజ్‌మనీ దక్కించుకోవలసిందేననే డెసిషన్ కొచ్చాడు అవినాష్!

సెట్లో పదిహేను పెట్టెలు... వాటి పక్కనే సుందరీమణులూ వున్నారు.

ప్రోగ్రామ్ కండక్ట్ చేస్తున్న యాంకర్... ఒక ప్రముఖ సినిమా నటుడు! అతను... సారీ సినిమా హీరో భలే భలే కొత్త కొత్త కహానీలు చెప్తూంటాడు. కవ్విస్తాడు. నవ్విస్తాడు. టెన్షన్ క్రియేట్ చేస్తాడు. అందరినీ ఆకట్టుకునేలా వ్యవహరిస్తాడు.

భలే మజాగా ఉంటుంది!

గేమ్‌షో టైటిలే తమాషాగ వుంది.

'కోటి కొట్టు! ముద్దు పెట్టు!'

పదునాలుగు పెట్టెలు ఖాళీగ వుంటయ్! ఒకే ఒక్క బాక్స్‌లో ప్రైజ్‌మనీ ఎమౌంట్ తాలూకూ ఫిగర్ దర్శనమిస్తుంది.

ఇచ్చిన మూడు 'ఛాన్సు'ల్లో ఏ వక్క బాక్స్‌లోనైనా కోటిరూపాయల నెంబర్ తగిల్తే గెల్చినట్టే! మూడు ఛాన్సులూ పోగొట్టుకుంటే అక్కడున్న పదిహేనుమంది భామల్లో మనసుకు నచ్చిన భామకు 'స్వీట్ కిస్' ఇవ్వాలి! ఇవీ గేమ్‌షో నిబంధనలు.

అమ్మాయికి కిస్ ఇవ్వాలనే విషయమే అవినాష్‌కు మింగుడు పడకుండా వుంది. అదీ ఓడిపోతే! నో!... తాను ఓడితే కదా ఆ ప్రాబ్లమ్ వుత్పన్నమయ్యేది! కోటిరూపాయల ప్రైజ్‌మనీ తానే తప్పక గెలుస్తాడు. తాను మోస్ట్ లక్కీ ఫెలో! ఇంతవరకు ఓటమి అనేదే ఎరుగడు. అందుకే ఆ ధీమా అవినాష్‌లో!

ఒకవేళ తాను ఓడితే! అమ్మో! అమ్మాయికి తాను హాట్‌కిస్ ఇవ్వటమా? నో! ముద్దిచ్చి తాను మైలపడలేదు. తన పాతివ్రత్యం దెబ్బతింటుంది. అలా జరగటం తనకు సుతరామూ ఇష్టంలేదు.

'గాడ్ ఈజ్ గ్రేట్' అనుకుంటూ పహిల్వాన్ లాగ జబ్బ చరుచుకుని గోదాలోకి దిగాడు... గెలుపు తననే తప్పక వరించగల 'కాన్ఫిడెన్స్'తో మూడు ఛాన్సెస్‌లో ఏ ఒక్కటైనా కరెక్ట్‌గ చెప్పలేకపోతాడాన్పించింది.

'షో'లో వున్న వనితలంతా విదేశీయులే! వాళ్ళకు ముద్దంటే ఇష్టం! తప్పులేదు. కానీ పార్టిసిపేట్ చేస్తున్న తాను భారతీయుడు! ప్యూర్... నిఖార్సైన ఇండియన్! పరాయి స్త్రీని తాకలేదు. అలాంటిది... స్వదేశమైన విదేశమైనా 'కిస్' ఎలా ఇవ్వగలడు!

ఈ ప్రాబ్లమ్‌కు సొల్యూషన్ ఒక్కటే! గేమ్‌షోలో తాను కరక్ట్ బాక్స్ నెంబర్ ఎంచుకుని ప్రైజ్‌మనీ గెలవటం!

టి.వీ. స్టూడియో సెట్‌లో లైట్లు వెలిగినయ్. ముద్దుగుమ్మలు... యాంకర్ రెడీ!

ఫస్ట్ టేకే ఒకే చేయాలి! అప్పుడు సక్సెస్ తనవంతౌతుంది.

యాంకర్ అటూ ఇటూ ఠీవిగ తిరుగుతున్నాడు బోన్లో సింహంలా! అతని జోక్స్‌ని గ్యాలరీలో వున్న ప్రేక్షకులంతా విరగబడి నవ్వుతున్నారు.

గేమ్‌షో కండిషన్స్ ఏమిటో అవినాష్ వేపు చూస్తూ మరోసారి వల్లించాడు యాంకర్.

'నే రెడీ... మీరు రెడీనా?' కనుబొమలెగరేస్తూ నవ్వుతూ ప్రశ్నించాడు యాంకర్.

గుప్పిట మూసి బొటనవేలు పైకెత్తి తానూ రెడీ అనే సంకేతాన్ని అభినయించాడు అవినాష్.

అవినాష్ కూడా ఖుషీగా వున్నాడు. మాంచి మూడ్లో వున్నాడు. కాన్ఫిడెన్స్‌ని కౌగలించుకున్నట్టు ధీమా అతనిలో కొట్టవచ్చినట్టు కన్పిస్తోంది.

అవి ఇవీ పర్సనల్ వివరాలడిగిన యాంకర్ మహాశయుడు అవినాష్ ఎదురుగా నిలబడి 'అక్కడున్న పదిహేను బాక్సుల్లో ఒక నెంబర్ ఛూజ్ చేసుకుని మీ మనసులో మాట వెల్లడించండి' అంటూ సీరియస్‌గ అవినాష్ ముఖంలోకి చూశాడు.

అవినాష్‌లో ఏదో తెలియని తడబాటు. సరైన నంబర్ ఎంచుకోగలడా లేదానే సందేహం మనిషిని కలవరపెడుతున్నయ్.

'కమాన్! త్వరగా ఫస్ట్ ఎటెమ్ట్ చెయ్యండి. బాక్స్ నెంబర్ చెప్పండి... యాంకర్ తొందరపెట్టాడు.

లేని నవ్వు ముఖాన పులుముకుంటూ... మనసులో కంగారుని బైట పడనీయకుండా మొదటి బాక్స్ ఎంచుకున్నాను. నంబర్ డిక్లేర్ చేయగానే బాక్స్ మూత తెరిచింది పక్కనున్న లతాంగి.

షేమ్! ఫస్ట్ ఎటెమ్ప్ట్ ఫెయిలైంది. అది నెంబర్‌లేని ఎంప్టీ బాక్స్ కావటంతో నాలుక్కర్చుకున్నాడు.

రెండవ నెంబర్ ఛూజింగ్‌లోనూ పప్పులో కాలేశాడు. ఏడుపు తన్నుకొస్తోంది. సిగ్గుతో తల దించుకున్నాడు.

ఆల్‌రైట్ మూడవబాక్స్ వుండనే వుంది. దాన్ని న్యూమరాలజీ ప్రకారం నిర్ణయించుకుని డిక్లేర్ చేస్తే సరి!

తనకు తాను ధైర్యాన్ని నూరిపోసుకున్నాడు. వీపు చరుచుకున్నాడు అవినాష్!

'మీ ఇష్టదైవాన్ని తల్చుకుని... లాస్ట్ అండ్ ఫైనల్... దటీజ్ మూడవ బాక్స్ ఎంచుకుని మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి...' యాంకర్ ఎంకరేజ్ చేశాడు.

అవినాష్‌లో టెన్షన్ మనిషిని కుదిపేస్తోంది!

తనకు ఓటమి తప్పదేమో! ఓడిపోతే చాలా నష్టపోవాల్సి వస్తుందేమోనే భయంతో గుండెవేగం పెరిగింది.

మూడో ఛాన్స్ కూడా తుస్‌మంది. మిస్ ఫైరైంది. ఏమిటీ ఇలా జరిగింది?... ఇప్పుడెలా?... ఏదో ఒక సుందరిని ఎన్నుకుని ముద్దుపెట్టక తప్పదా?... సమస్యల వలయంలో అవినాష్ కొట్టుమిట్టాడుతున్నాడు.

'చూడండి అవినాష్!... మరో పది సెకండ్స్‌లో మీరు మీ కిష్టమైన భామను ఎంచుకుని కిస్ ఇవ్వకపోతే నేను నిర్ణయించిన అమ్మాయి మీవద్దకొచ్చి కిస్ చేస్తుంది' చివరి నిర్ణయాన్ని చెప్పాడు యాంకర్.

ఓ అమ్మాయి రానే వచ్చింది... ముద్దు ఇవ్వనే ఇచ్చింది.

చచ్చాన్రా దేవుడో... మైల పడిపోయాను... నా పాతివ్రత్యం పాడైపోయింది... గావుకేకలు పెడుతూ పడుకున్న మంచంమీద లేచి కూర్చున్నాడు.

'ఓరి బడుద్ధాయ్! పగటి కలలు కంటున్నావా ఏమిట్రా?... ఏ ఆడపిల్ల అయినా నిన్ను ముద్దుపెట్టుకుండా ఏమిటి ఖర్మ...' మనుమడి వీపు చరుస్తూ అడిగింది బామ్మ.

నిజం చెప్పటానికి సిగ్గుపడ్డ అవినాష్ బెడ్‌రూమ్‌లోంచి బైటికి తుర్రుమన్నాడు.

- సమాప్తం -